## బ్యాటరీ పేలి విద్యార్థి చేతివేళ్లు ఛిద్రం

**శివంపేట, మే 3 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన శివ్వంపేటలో 4వ తరగతి చదువుతున్న రాజిపేట శివతేజ్ అనే బాలుడు బ్యాటరీ పేలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో బాలుడి ఎడమ చేతి నాలుగు వేళ్లు తెగిపోయాయి. స్థానికుల లభించిన వివరాల ప్రకారం, శివతేజ్ ఇటీవల శివంపేటలోని ఓ దుకాణంలో ఎండాకాలం దృష్ట్యా చేతిలో పట్టుకునే చిన్న ఫ్యాన్ కలిగిన బ్యాటరీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఆ బ్యాటరీను ఉపయోగిస్తున్న సమయంలో అకస్మాత్తుగా పేలడంతో ఈ ప్రమాదం జరిగింది. పేలుడు ధాటికి ఎడమ చేతి నాలుగు వేళ్ళు తెగి కింద పడ్డాయి. బాలుడిని కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి బాలుడికి చికిత్స అందిస్తున్నారు.



చిద్రమైన శివతేజ్ చేతివేళ్లు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## ప్రమాదవశాత్తు నివాసిత పూరిగుడిసే దగ్ధం

**చిన్నశంకరంపేట, మే 3,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు నివాసిత పూరిగుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధి మల్లుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నాగమణి, రమేష్ దంపతులు పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసెలో ఆకస్మత్తుగా మంటలు వ్యాపించాయి. ఇరుగుపొరుగు వారు గమనించి మంటలను అదుపుచేసేలోపు పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో ఆరతులం బంగారం, వెండి, నిత్యావసర సరుకులు, ఆధార్, బ్యాంకు, పట్టా పాస్‌పుస్తకాలు, దుస్తులు కాలిపోయాయని, సుమారు లక్ష రుపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామ సర్పంచి ఇమ్మడి నరేష్ కోరారు. మెదక్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఆర్ఐ రాజుకు సమాచారం అందించినట్లు సర్పంచి తెలిపారు.



మల్లుపల్లిలో పూర్తిగా దగ్ధమైన పూరిగుడిసె



బొడ్మట్‌పల్లిలో భద్రకాళీ వీరభద్ర స్వామి కళ్యాణోత్సవం, ఇన్‌సెట్లోన మంత్రి దామోదర్ హాజరైన దృశ్యం.

## వీరభద్రాలయంలో మంత్రి దామోదర్ ప్రత్యేక పూజలు

**- బొడ్మట్‌పల్లిలో భద్రకాళీ వీరభద్రుల కళ్యాణోత్సం**

**టేక్మాల్, మే 3, ప్రభాతవార్త:** టేక్మాల్ మండలం పరిధిలోని బొడ్మట్‌పల్లి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చన అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కళ్యాణవేదికపై భద్రకాళీ, వీరభద్రుల కళ్యాణం కమనీయంగా జరిగింది. లోకకళ్యాణార్థం కోసం తలపెట్టిన ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మెన్ బస్వరాజ్ స్వాగతం తెలిపారు. కళ్యాణోత్సవానికి దంపతులు, వివాహోత్సవ కార్యక్రమానికి పెళ్ళిపెద్దలుగా మారారు. హాజరైన భక్తులందరికి కోరుకున్న కోరికలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామస్తులు భక్తులు అధికసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదానంలో పాల్గొన్నారు. సాయం త్రం గ్రామంలో నిర్వహించిన విగ్రహాల ఊరేగింపులో స్వాములు చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

**వీరభద్రుణ్ణి దర్శించుకున్న మంత్రి దామోదర్**

రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామెదర్ రాజనర్సింహ బొడ్మట్‌పల్లి గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రుణ్ణి ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ బస్వరాజ్ వారికి పూర్ణ కుంభంతో ఆహ్వానించి శాలువలు కప్పి సన్మానించారు. భక్తుల సౌకర్యం కోసం నిధులు మంజురు చేయాలని కోరగా మంత్రి దామోదర్ సానుకులంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తామని హామి ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు రమేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకరప్ప, బొడ్మట్‌పల్లి గ్రామ వీరశైవలింగాయత్ సమాజం అధ్యక్షులు వినోద్ కుమార్, గ్రామ సర్పంచ్ అవినాష్, మండల నాయకులు సత్యనారాయణ, భూంరెడ్డి, మాన్‌కిషన్‌లతో పాటు మండల నాయకులు కార్యకర్తలు గోపాల్, శ్రీశైలం, భూషణం, ధనుంజయలు పాల్గొన్నారు.

**వీరభద్రుణ్ణి దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్**

టేక్మాల్ మండలం పరిధిలోని బొడ్మట్‌పల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కళ్యాణోత్సవానికి అందోల్ మాజీ శాసన సభ్యులు క్రాంతికిరణ్ హాజరయ్యారు. ప్రత్యేక పూజకార్యక్రమాల్లోనపాల్గొని తీర్థ ప్రసా దాలను స్వీకరించారు. ఇందులో మండల పార్టీ అధ్యక్షులు వీరప్ప. మండల నాయకులు సిద్దయ్య, భాస్కర్, ఈశ్వరప్ప, శ్రీశైలం, సారాందాస్,విఠల్, రమేష్ నాయక్, సాయిలు, కృష్ణలతో పాటు తదితరులున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నీట్ 2026 పరీక్ష

**937 మంది అభ్యర్థులకు గానూ**

**916 హాజరు కాగా హాజరు కానీ 21 మంది అభ్యర్థులు**

**పరీక్ష నిర్వహణను పర్యవేక్షించిన : జిల్లా కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ 2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నా 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షా నిర్వహించారు. 937 మంది అభ్యర్థులకు గానూ 916 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 21 మంది హాజరు కాలేదు. పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి సందర్శించి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు ప్రణాళికతో నీట్ పరీక్షను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు.పరీక్షను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.



పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## అకాల వర్షం దెబ్బ...రైతుల కష్టాలు నీటిలో కలిసినట్టే

**హుస్నాబాద్ రూరల్, మే 3, ప్రభాతవార్త:**

హుస్నాబాద్‌లో అకస్మాత్తుగా కురిసిన వర్షం రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఉదయం నుంచి తీవ్ర ఎండ ఉన్నప్పటికీ మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం ప్రభావంతో హుస్నాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రానికి రైతులు అమ్మకానికి తీసుకొచ్చి ఆరబోసుకున్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసిపోయింది. టార్పాలిన్ కవర్లు కప్పేలోపే వర్షం జోరుగా పడటడంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని ఇప్పటికే 15 రోజులు గడిచినా తేమ ఎక్కువ అనే కారణంతో అధికారులు కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షం కారణంగా ధాన్యం మరింత నష్టపోయిందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



అకాల వర్షంతో తడిసిపోయిన వరి ధాన్యం

# సిఎం కావాలన్న ఆశ లేదు: మంత్రి వివేక్

**-విశాఖ ట్రస్ట్‌తో నిరుపేదలకు సహాయం చేస్తున్నాం**

**రామచంద్రాపురం, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్ర కేబినెట్ మంత్రిగా సేవలు అందించాలని అనుకున్నాను కాని ముఖ్యమంత్రి కావాలన్న ఆశన తనకు ఎప్పుడూ లేదని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తన మనసులోని మాటను బయటపెట్టారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురం మండల పరిధిలోని తెల్లాపూర్ పరిధిలోని ఆసన్క ఎడ్యూకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను శనివారం రాత్రికి మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ పేదల ఆర్థిక అభివృద్దికి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని సూచించారు. తన వంతుగా విశాఖ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి నిరుపుదలకు సహాయం అందిస్తున్నామన్నారు. నిరుపేద యువతకు వివిధ క్రీడలతో ఉచిత శిక్షణను అందించాలన్న లక్ష్యంతో కొల్లూరి సత్తయ్య స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆస్క్ ఎడ్యూకేషన్ సొసైటీని ఏర్పాటు చేసి దేశంలోని నిరుపేద విద్యార్థులకు ఇంగ్లీషు తదితర అంశాలపై ఉచితంగా వసతి కల్పించి శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. జర్మనీలో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అందుకే ఆస్క్ సంస్థ ఇక్కడి యువతకు జర్మనీ భాషపై పట్టు సాధించే విధంగా శిక్షణ అందించాలని సూచించారు.

సామాజిక సేవ చేసేందుకు గొప్ప మనసు ఉండాల్సిన అవసరరం ఉందన్నారు. తమ సంతానం క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు తమ వంతు చొరవ తీసుకోవాలన్నారు. క్రడల్లో రాణిస్తే బంగారు భవష్యత్తు తథ్యమన్నారు. క్రీడాకారులకు శిక్షణ అందించే శిక్షకులు తక్కువగా ఉన్నారని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వినతి చేశారు. కొల్లూరి సత్తయ్య మాట్లాడుతూ తమ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 70 శాతం నిరుపేద విద్యార్థులకు ఉచితంగా వివిధ క్రీడల్లో శిక్షణ అందించి జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కంచె ఐలయ్య, కెవి రాజు, మాజీ కౌన్సిలర్ భరత్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బాలయ్య, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



సీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి దృశ్యం

# పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన పనులు

**- అసంపూర్తిగా సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు- 5 ఏళ్ళుగా అసంపూర్తిగా నిలచిపోయిన పనులను పట్టించుకునే నాథుడే కరువు**

**-కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సమీకృత మార్కెట్ భవనం పూర్తయ్యేనా ?**

**నర్సాపూర్ మే 3, ప్రభాతవార్త :**

నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 5 సంవత్సరాల క్రితం నూతన సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు చేపట్టి అసంపూర్తిగా పిల్లర్ల స్థాయిలోనే వదిలేశారు. నర్సాపూర్ పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగించి అట్టి స్థలములో ఈ సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణం ప్రారంభించారు. ఈ సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు 5 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అయితే 2021 జూన్ లో ఈ సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సమీకృత మార్కెట్ భవన నిర్మాణంలో కింది మొదటి అంతస్తు వరకు స్లాబులు వేసి అసంపూర్తిగా మిగిలిపోగా పిల్లర్ల స్థాయిలోని నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ సమీకృత యార్డు నిర్మాణం పనులు 5 సంవత్సరాలు గడుస్తున్న ప్రజా ప్రతినిధులు గాని అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గత బి ఆర్ఎస్ ప్రభుత్వంలో శంఖు స్థాపన చేయగా అటు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు గడిచినా మోక్షవ లబించలేదు అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఈ సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణం జరుగుతుందోనని అనుకున్న పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. అయితే ఈ సమీకృత మార్కెట్ యార్డులో పార్కింగ్ స్థలం వదిలివేయగా 28 వెజ్ దుకాణాలు, 18 నాన్ వెజ్ దుకాణాలు, 8 పండ్ల పూల దుకాణాల నిర్మాణాలకు పనులు చేపట్టారు. గత బి ఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలివేసిన ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏండ్లు గడిచిన ఈ సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు చేపట్టకపోవడం పట్ల పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం నుండి కోట్లు నిధులు మంజూరైన సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. సదరు కాంట్రాక్టర్ సకాలంలో చేసిన పనులకు బిల్లులు రాక పోవడంతోనే ఈ సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు వదిలేశాడని తెలుస్తుంది. నర్సాపూర్ లో ఈ సమీకృత మార్కెట్ యార్డ్ భవనం అసంపూర్తిగా వదిలి వేయడంతో పట్టణంలో కూరగాయలు, పండ్ల దుకాణాలు,పూల దుకాణాలు, నాన్ వెజ్ తదితర దుకాణాలు రోడ్లపైనే పెడుతూ ప్రజల రాకపోకలకు ఎన్నో ఇబ్బందులు ఆటంకాలు ఎదురవుతున్నాయి.

అయితే నర్సాపూర్ పట్టణంలో సమీకృత భవనం పూర్తయితే అన్ని దుకాణాలు ఒకే దగ్గర ఉండటంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేదని ప్రజల అభిప్రాయం. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ సమీకృత మార్కెట్ యార్డ్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ యార్డు పనులను పూర్తి చేసి ప్రజలకు మార్కెట్ యార్డ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సాపూర్ లో అసంపూర్తిగా సమీకృత మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన దృశ్యం

## పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

**మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

**బెజ్జంకి, మే 3, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట కాలిపోగా బాధిత రైతులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం సంఘటన స్థలం వద్ద పరామర్శించారు. అనంతరం ప్రమాద ఘటనకు గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులకు తక్షణ సహాయం అందించాలన్నారు. ముగ్గురు రైతులు అరుగాలం శ్రమించిన ఫలితం లేకుండా పోయిందని సుమారు 10 ఎకరాల చేతికి వచ్చిన పంట దగ్ధం కావడంతో రూ.15 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. కరెంటు నిర్వహణ సరిగా లేక ఈ ప్రమాదం వాటిల్లిందని కరెంటు సరఫరాలో లోపం విద్యుత్ తీగలు పొలాల్లోనే వేలాడటం, ట్రాన్స్‌ఫార్మర్‌లు సైతం పొలాల్లోనే ఉండటం వలన ప్రమాదానికి కారణం అన్నారు. బాధిత రైతులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందించే వరకు అండగా ఉంటామని ఆధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.



కాలిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం

# బర్రెంకల కుంట సర్వే ఎప్పుడు?..

**-ఐదు నెలలు కావస్తున్నా కుంట సర్వేపై ఎటూ తేల్చని వైనం...**

**-కుంటను కాపాడాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు...**

**నార్సింగి, మే 3, ప్రభాతవార్త :**

నార్సింగి మండల కేంద్రంలో శేరిపల్లికి వెళ్లే రహదారిలో బర్రెంకల కుంట సర్వేనెంబర్ 624లో ఐదు ఎకరాల 14 గుంటలు కబ్జాకు గురవుతుందని పలు పత్రికలో ప్రచురితమైన విషయం మన అందరికీ తెలిసినదే.అయితే కుంట సర్వే విషయంలో సుమారు ఐదు నెలలు కావస్తున్న ఇంతవరకు సర్వే నిర్వహించకుండా రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారు.

ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించాలని తహశీల్దార్ గ్రేస్ బాయ్ కు లెటర్ రూపకంగా ఇచ్చినా,తహశీల్దార్ గ్రేస్ బాయ్ మాత్రం సర్వే ప్రక్రియను నిలిపివేయడం ఇప్పుడు తీవ్ర అనుమానాలకు తావిస్తోంది.స్థానిక ప్రజలు,రైతులు ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మద్దతుగా జరుగుతోందని ఆరోపిస్తున్నారు.ప్రభుత్వానికి చెందిన ఈ కుంట భూమి పై కొందరు ఆక్రమణలకు పాల్పడి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో అధికారులు సర్వే చేయాలని నిర్ణయించారు.కానీ సర్వే జరిగితే అసలు నిజాలు బయటపడతాయని,అందుకే కావాలనే ఆలస్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



కుంట కబ్జా చేసి భూమిని చదును చేస్తున్న దృశ్యం

గ్రామానికి ఉపయోగపడే కుంటను కాపాడాల్సిన అధికారులు ఎందుకు మోనం వహిస్తున్నారు.ఎవరిని కాపాడేందుకు సర్వే ఆపుతున్నారుని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.వెంటనే జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పారదర్శకంగా సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను రక్షి ంచాలని గ్రామస్తులు,నాయకులు డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**..ఆర్డీవోను ఫోన్ ద్వారా వివరణ కోరగా..**

బర్రెంకల కుంట వ్యవహారంపై ఆర్డీవోను ఫోన్ ద్వారా సంప్రదించి వివరణ కోరగా స్పందించలేదు.పలుమార్లు చరవాణికి ప్రయత్నించినప్పటికీ ఫోన్ లిఫ్ట్ చేయలేదు.దీంతో అధికారుల మోనం పై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గతంలో కుంట కబ్జా కాకుండా బోర్డు పెట్టిన దృశ్యం

## పందిళ్ళ వంతెన వద్ద కారు ప్రమాదం

**ఇద్దరికీ తీవ్ర గాయాలు**

**హుస్నాబాద్ రూరల్, మే 3, ప్రభాతవార్త :**

హుస్నాబాద్ మండల పరిధిలోని పందిళ్ళ వంతెన సమీపంలో ఆదివారం కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్ మండలం శ్రీరాములపల్లికి చెందిన గంగం శ్రీధర్‌రెడ్డి(40), భార్య దివ్యతేజ(32), కుమారుడు నిహార్‌రెడ్డి(11) కూతురు శ్రీనిక(6) కలిసి హైదారాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా పందిళ్ళ వంతెన వద్ద కారు అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో దివ్యతేజ, కుమారుడు నిహార్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. శ్రీధర్‌రెడ్డి,శ్రీనికకు స్వల్ప గాయలైనట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రహదారి ఇరువైపులా సరైన ప్రమాద సూచికలు(సైన్ బోర్డులు) ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు తెలిపారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు హుస్నాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన కారు

## రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :**

మండలంలోని ఎం జలాల్పూర్ గ్రామం. గ్రామపంచాయతీలో శనివారం నాడు శాస్త్రవేత్తలు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పచ్చి రొట్టె పంటల ద్వారా యూరియాసక్రమ వినియోగం. పంటల వైవిధ్యీకరణ. పురుగు మందుల హానికర ప్రభావాలు. వరి. విత్తన శుద్ధి. వేప. ఆధారిత స్ప్రేలు. డ్రిప్ సాగు ద్వారా నీటి సంరక్షణ. డ్రం లీడర్ విధానం. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత అంశాలపై. రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి జె టి ఏ యు అధ్యాపకులు డాక్టర్ బి సవిత. ప్రొఫెసర్. డాక్టర్ ఎం ప్రమీల. పాల్గొన్నారు ఏయూ చంద్రవేణి. వ్యవసాయ శాఖ సిబ్బంది. గ్రామ రైతులు పాల్గొన్నారు.



దగ్ధమవుతున్న దృశ్యం

## అగ్ని ప్రమాదంలో హేమా ఇండస్ట్రీస్

**కొండాపూర్, మే 3, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో హేమా ఇండస్ట్రీస్ పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో ప్లైవుడ్ రా మెటీరియల్స్, ఫిల్లింగ్ మెటీరియల్స్, ఫ్లష్ డోర్లు, యంత్రాలు మరియు ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు.అలాగే మంటలు పక్కనే ఉన్న గ్రీన్ క్రాఫ్ట్ కంపెనీకి కూడా వ్యాపించడంతో అక్కడి యంత్రాలు, స్టాక్ మరియు ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి.ప్రాథమిక విచారణలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని, ఆస్తి నష్టం వివరాలు ఇంకా అంచనా వేయాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు.

## దుర్గమ్మ నామస్మరణలతో దద్దరిల్లిన ఏడుపాయల


క్యూలైన్‌లు నిండుకోవడంతో ధ్వజస్తంభం వద్ద వేచి ఉన్న భక్తులు


భక్తులకు దర్శనమిస్తున్న వన దుర్గమ్మ తల్లి

**పాపన్నపేట, మే 3, ప్రభాతవార్త :** అమ్మలగన్న అమ్మ...మాయమ్మ దుర్గమ్మ ..అంటు భక్తుల నామస్మరణలతో ఏడుపాయల వనదుర్గ భవానిమాత క్షేత్రం దద్దరిల్లింది. వేసవిసెలవులు, ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయల వనదుర్గ భవానిమాతను దర్శించుకునేందుకు విచ్చేయడంతో ఏడుపాయల క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. వేకువ జాముననే వేద పండితులు వేద మంత్రాల మధ్య అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, వివిధ రంగుల పువ్వులతో అమ్మవారు ధగధగలాడుతూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచివచ్చిన భక్తులు మంజీరానది మడుగులు, చెక్ డ్యాం, పాయలల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మ వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లలో వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలునిర్వహించిగా మరికొందరు అమ్మవారికి ఒడిబియ్యం, తల నీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వేద పండితులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, నాగరాజు శర్మ, మురళిశర్మ, రాజశేఖశర్మలు పూజలుచేపట్టగా. భక్తుల సౌక ర్యల కల్పనలో ఇఓ వీరేశం, తమ సిబ్బందితో చర్యలుచేపట్టారు. ఏడుపాయలలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండ పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో గట్టి పోలీసు బందోబస్తు చేపట్టారు.

**రంగు మారిన నీళ్ళు.... పాకుడు పట్టిన బండలు..:**

మంజీరా మడుగులు ఆకుపచ్చని నీటితో, పాకుడుపట్టిన బండలు దర్శన మిస్తున్నాయి. ఘనపూర్ ప్రాజెక్టులో నీరు లేక పోవడంతోపాటు మంజీరా చెక్‌డ్యాం, మడుగు లలో నీరు ఎప్పుడో ఎగువకు విడుదల చేసిన నీరు నిలిచి పోవడంతో ఆ నీరు రంగు మారి పోవడమే కాకుండా దోమలు స్వైరవిహారం చేస్తూ దర్శన మిస్తున్నాయి. రంగు మారిన నీటిలో పుణ్య స్నానాలు ఆచరిస్తే చర్మ వ్యాధుల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## పాత్రికేయులకు స్వేచ్ఛ నివ్వాలి

**రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**టేక్మాల్, మే 3, ప్రభాతవార్త:** నిజాన్ని నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేసే ప్రతికలకు, పాత్రికేయులకు, పత్రికా సంస్థలకు స్వేచ్ఛ నివ్వాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆది వారం ప్రపంచ పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లికి వచ్చిన సందర్భంగా అందోల్ టియు డబ్ల్యు జె యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాన్ని అమ్మి అబద్ధాన్ని నిజం చేయకుండా వ్యాపారం చేయకుండా నిజాలను నిప్పులా వెళ్లగక్కుతూ నిరంతరం విలేకరులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఇందులో ఆందోల్ నియోజకవర్గం అధ్యక్షులు భూమయ్య, కార్యదర్శి యాదగిరి, సీనియర్ నాయకులు ఆనంద్‌లతో పాటు తదితరులున్నారు.


బొడ్మట్‌పల్లిలో కేక్‌కట్ చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

## భక్తులతో కిటకిటలాడిన తునికి నల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 3, ప్రభాతవార్త:** జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆది వారం నాడు భక్తులతో కిటకిటలాడి పోయింది. ఉదయం నుండియే భక్తుల తాకిడి పెరుగుతూ వచ్చింది. తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు, అభివృద్ధి కమీటి చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి శివప్ప వేదమంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. సర్పంచుల ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్, కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షులు చంద్రం కిషోర్ గౌడులు తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ సిబ్బంది ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. భక్తులు శివ సత్తుల శిగాలు, డప్పు చప్పుల దరువుల నడుమ


తునికి నల్లపోచమ్మకి ప్రత్యేక పూజలు జరిపించిన సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్

అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకోచ్చి ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసిన తర్వాత అమ్మవారి ఎదుట బోనం నైవేద్యాలను పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గర్భగుడిలో అమ్మ వారి దర్శనం చేసుకోని తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వాచనం పోందారు.

కొంత మంది భక్తులు తమ కోరికలు తీర్చిన శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ఒడి బియ్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయం వద్ద భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వేసవి ఎండ తీవ్రత రూపం దాల్చుతున్న సందర్భంలో ఆలయంకు విచ్చేసే భక్తులకు త్రాగునీటి సమస్య రాకుండా ఆలయ అభివృద్ధి కమీటీ సభ్యులు, ఆలయ సిబ్బందితో మౌళిక సదూపాయాలను కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తొచినంత విరాళాలు ఇస్తే భక్తులకు సౌకర్యార్థం కాటేజ్‌లు నిర్మించ బడుతాయని ఇంచార్జి ఈవో రంగ రావు విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో వీరితో పాటు గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి శేఖర్, ఉప సర్పంచ్ మధుసూధన్ గౌడ్, ఆలయం జూనియర అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ పూజారి రాజేశ్వర్, విఘ్నేష్ అప్ప, గ్రామ పెద్దలు సాయా గౌడు, శంకర్, శేఖర్, చల్ల మల్లేశం, మల్లికార్జున్ గౌడ్, సంబారపు తిరుమల్లేశ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు రైతు వేదికలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక

**నాగల్‌గిద్ద, మే 3, ప్రభాతవార్త:** ఈ నెల 4న మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రరంభం అయ్యే కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.


చాముండేశ్వరిదేవిని దర్శించుకుంటున్న భక్తులు.

## అమ్మ దర్శనం భక్తులకు పరవశం

**చిలిపిచెడ్, మే 3 (ప్రభాతవార్త ) :** మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో గల మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ చాముండేశ్వరి మాత ఆలయం ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అంత కిటకిటలాడింది. భక్తులు మంజీరా పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ఒడిబియ్యం పోసి, ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు ప్రభాకర్ శర్మ, సుబ్రహ్మణ్య శర్మ ,మోతిలాల్ శర్మ, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మేనేజర్ శోభన్ బాబు భక్తుల నిమిత్తం నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## మహిళా సమస్యలను తెలుసుకున్న రాష్ట్ర బిజెపి ఇంచార్జి

**రామచంద్రాపురం, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను బిజపి రాష్ట్ర నాయకులు, బిజెపి ప్రజాప్రతినిధులు తెలుసుకున్నారు. ఆదివారం రామచంద్రాపురంలోని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిల నివాసంలో బిజెపి రాష్ట్ర ఇంచార్జి అభయ పాటిల్, ఎంపి కొండా విశ్వేశ్వరర్‌రెడ్డిలు కలుసుకుని నియోజకవర్గ మహిళలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మహిళలు బిజెపి నాయకులు పలు విషయాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన మహిళలకు డబుల్ బెడ్ రూంలు మంజూరు కావడం లేదని, అర్హులందరికి పింఛన్లు అందడం లేదని వివరించారు. మహిళా సవరణ బిల్లు వీగిపోవడం విచారకర మన్నారు. మహిళా రిజర్వేషన్‌లకై తమవంతు పోరాటం చేస్తామని మహిళలు నాయ కులకు వివరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్‌రరెడ్డి, భారతీ నగర్ డివిజన్ బిజెపి నాయకులు రఘునాథ్‌రెడ్డి, రామచంద్రాపురం డివిజన్ అధ్యక్షురాలు బసమ్మ, నాయకులు సంతోషి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


: మహిళలతో సమావేశం అయిన రాష్ట్ర బిజెపి ఇంచారి, ఎం౦, ఎమ్మెల్సీలు

## విద్యా, వైద్యం,ఉపాధి హక్కుల కోసం యువత ముందుండి పోరాడాలి

**బెజ్జంకి, మే 3,ప్రభాతవార్త :** విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల కోసం యువత ముందుండి పోరాటం చేయాలని ఎఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు బోనగిరి రూపేష్


జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పిలుపునిచ్చారు .మండల కేంద్రంలోని బెజ్జంకిలో ఆదివారం ఎఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లా డారు. అఖిల భారత యువజన సమాఖ్య 67 యేండ్ల సుదీర్ఘ పోరాటం చేసిన ఘనత ఉందన్నారు. భారతదేశ రాజ్యాంగ పరిరక్షణ ప్రజా సామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతి,యువకులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు,సీపీఐ, ఎఐవైఎఫ్ నాయకులు కల్లూరి బాలమల్లు, రొడ్డ చరణ్, దుగ్యని తిరుపతి, రవి, కొమురయ్య, నవీన్,రాజు, అంతటి సురేష్, నవీన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన కాలనీవాసులు

## అమీన్‌పూర్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ అభినందనీయం

**అమీన్‌పూర్, మే 3 (ప్రభాతవార్త):** అమీన్‌పూర్ ప్రాంతంలో ప్రతిపాదిత ఎస్‌టీపీ ప్రాజెక్టును ఇతర ప్రాంతానికి మార్చేందుకు చొరవ తీసుకుని ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే గారిని అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు అందించిన మద్దతుకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అమీన్‌పూర్ ప్రజల తరఫున ఎమ్మెల్యే గారికి ఘనంగా అభినందన సభ నిర్వహించాలని తమ ఆకాంక్షను వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవకు కృతజ్ఞతగా ఈ సభను ఏర్పాటు చేయాలని సభ్యులు పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల రెడ్డి, ఉపాధ్యక్షుడు విష్ణు, సభ్యులు ప్రశాంత్, విష్ణు, యశోద, పవన్, రమేష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.ఎమ్మెల్యే గారు ఈ ప్రతిపాదనను సానుకూలంగా స్వీకరించి, ప్రజల అభిప్రాయాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు.

## గ్రామాభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తానని మంత్రి హామీ

**జోగిపేట, మే 3, ప్రభాతవార్త:** నేరెడిగుంట గ్రామాభివృద్ధికి సహకరించాలని గ్రామ సర్పంచు ఒగ్గు సాయికిరన్ ఆదివారంనాడు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి విజ్ఞప్తి చేశారు. తమ గ్రామాన్ని మంత్రి దత్తత తీసుకోవటం చాలా మంచి పరిణామమని, అయితే ఇంకా తమ గ్రామంలో చాలా సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని మంత్రికి వివరించారు. ప్రధానంగా గ్రామంలో సంపూర్ణంగా సిసిరోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటుగా బ్రాహ్మణపల్లి చౌరస్తానుంచి నేరెడిగుంట వరకు ఉన్న బిటి రోడ్డు మరమ్మతులు చేపట్టాలంటూ మంత్రికి వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలన్నింటికీ సంబంధింది సమగ్ర నివేదికను రూపొందించుకొని వెళ్లిన సర్పంచు సాయి మంత్రి దామోదర్ రాజనర్సింహకు గ్రామ పరిస్థితి గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో ఏసమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.


మంత్రి దామోదర్‌కు గ్రామ సమస్యలు విన్నవిస్తున్న దృశ్యం

## పైతరలో ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణం

**నూతన కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**కొల్చారం, మే 3, ప్రభాత వార్త :** కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామంలో ఆదివారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆకాంక్షి ంచారు .గ్రామ వాస్తవ్యులు యెల్లుగారి రామకృష్ణారెడ్డి, వారి సతీమణి శ్రీమతి కుటుంబ సభ్యులు గ్రామ ప్రజల సౌకర్యార్థం నిర్మించిన నూతన కళ్యాణ మండపాన్ని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం మండపంలో స్వామివారి కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ కార్యక్రమంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అలాగే మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్ గుప్తా, టీఆర్ఎస్ పార్టీ మండల యువత విభాగం అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, గ్రామ సర్పంచ్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాబన్నగారి రవితేజ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, ఉపసర్పంచ్ సుధాకర్, భానుప్రకాశ్ రెడ్డి, మల్లారెడ్డి, మల్లేశం, భూమయ్య, శేఖర్, తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు మోత్కు మల్లేశం, ఉపసర్పంచ్ ఆర్య రవీందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు


పాల్గొన్న భక్తుల దృశ్యం

## పైతరలో నూతన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం

**కార్యక్రమంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్**

**కొల్చారం, మే 3, ప్రభాతవార్త :** కొల్చారం మండలం పైతర గ్రామంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం సందర్భంగా నూతన కళ్యాణ మండపం ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుల్లబోయిన దుర్గేష్ ముదిరాజ్ పాల్గొని ఆలయ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పైతర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అతిథులను ఘనంగా సన్మానించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం...మానసిక ప్రశాంతత

**మున్సిపల్ చైర్మన్ మనుచూరి లక్ష్మీరాజు యాదవ్**

**నర్సాపూర్ మే 2, ప్రభాతవార్త :** ప్రతిరోజు యోగా చేయడంతో మనిషికి సంపూర్ణ ఆరోగ్యం తో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ వ ు న ు చ ూ రి లక్ష్మీ ్మరాజు యాదవ్ అన్నారు. శనివారం బుద్ధ పౌర్ణమి నీ పురస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలోని లక్ష్మీ ్మ పిరమిడ్ యోగ కేంద్రం ఆధ్వర్యంలో యోగ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ ్మ రాజు యాదవ్ హాజరై ఆమె మాట్లాడుతూ ప్రతినిత్యం యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగ సాధన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగ ధ్యానం చేయడం ద్వారా సానుకూల మైన మంచి ఆలోచనలు కలుగుతాయి అన్నారు. బుద్ధుడు సూచించిన శాంతి ఆత్మస్థైర్యం వంటి విలువలు గల జీవితం యోగ సాధన ద్వారా లభిస్తుందని తెలిపారు. యువకులతో పాటు ప్రతి ఒక్కరి యోగాను అలవాటు చేసుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని యువతకు మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ ్మ రాజు యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ్మ పిరమిడ్ యోగా కేంద్రం నిర్వాహకులు, స్థానిక ప్రజలు, యోగ సాధకులు, పెద్ద సంఖ్యలో


నర్సాపూర్ పట్టణంలోని లక్ష్మీ పిరమిడ్ యోగ కేంద్రంలో నిర్వహించిన యోగపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మనుచూరి లక్ష్మీరాజు యాదవ్ తదితరులు



## జన గ్రహ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**నర్సాపూర్ మే 2, ప్రభాతవార్త :** ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరగనున్న జనగ్రహ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు ఈ సందర్భంగా ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాప గారి రమేష్ గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్లోని పెరేడ్ గ్రౌండ్లో ఈనెల 10వ తేదీన జనగ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఇటీవల పార్లమెంటులో బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో మహిళా బిల్లును ప్రవేశపెట్టగా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని అన్నారు. దీంతో మహిళా బిల్లు పార్లమెంట్లో ఆమోదించబడలేదని దీంతో దేశంలోని 70 కోట్ల మంది మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతో మహిళా బిల్లును ప్రవేశపెడితే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం సహించరానిదన్నారు. ఈ మేరకు ఈ నెల 10న జరిగే జన గ్రహ బహిరంగ సభకు కార్మికులు కర్షకులు ఉద్యోగులు మేధావులు విద్యార్థులు సబ్బండ వర్గాల వారు అధిక సంఖ్యలో ఈ బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని పాప గారి రమేష్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బాదే బాలరాజ్ నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు నీరుడి చంద్రయ్య, ప్రధాన కార్య దర్శులు బోర్ వెల్ రాంరెడ్డి,సంఘసాని రాజు తదితరులు పాల్గొన్నారు .

## 10లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం చేసిన సర్పంచ్

**నర్సాపూర్ మే 2, ప్రభాతవార్త :** పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులను శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్న చింతకుంట గ్రామ సర్పంచ్ ప్యాట సరిత మహేష్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మహేష్ మాట్లాడుతూ ఇదే పట్టుదలతో నూతన ఉత్సాహంతో పట్టుదలతో చదివి మంచి ఉద్యోగాలు పొంది జీవితంలో ఉన్నత స్థాయికి. ఈ మేరకు మీ తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేసి వారికి తోడునీడగా ఉండి సహకారం అందించాలని, విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని సర్పంచ్ సరితా మహేష్ విద్యార్థులకు సూచించారు., ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఉప సర్పంచ్ వజ్జె పెంటయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మాసాయిపేటలో శనివారం నాడు తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం సేకరణ. ధాన్యం తేమశాతం. ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరి ధాన్యాన్ని వేగవంతంగా రవాణా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ దన్సింగ్. సర్వేర్ నరసింహులు. మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ నర్సింలు. రైతులు పాల్గొన్నారు.

## ఉప్పు లింగాపూర్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు

**వెల్దుర్తి, మే 2, ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పులింగాపూర్. ఆరెగూడెం. వెల్దుర్తి. గ్రామాల్లో ప్రజా పాలన. ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా మదకద్రవ్యాలు. మానవ అక్రమ రవాణా. లింగ వివక్ష. లింగ సమానత్వం. స్త్రీ ద్వేషం. బాల్య వివాహాలు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు .


నర్సాపూర్ లోని బి వి ఆర్ ఐ టి కళాశాల లో నూతన రతన్ టాటా బ్లాక్ భవనం ప్రారంబిస్తున్న దృశ్యం


టిసిఎస్ టెక్నాలజీ సాఫ్ట్వేర్ అండ్ సర్వీసెస్ విభాగ అధ్యక్షులు వి రాజన్న,శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి విష్ణురాజు.తదితరులు

## ఏ ఐ ఒక సాంకేతిక పరిణామం

**నర్సాపూర్ మే 2, ప్రభాతవార్త :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఒక సాంకేతిక పరిణామమని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ టిసిఎస్ టెక్నాలజీస్ సాఫ్ట్వేర్ అండ్ వి రాజన్న పేర్కొన్నారు. శనివారం బి వి ఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో రతన్ టాటా బ్లాక్ నూతన భవనం (విష్ణు స్కూల్ ఆఫ్ అప్లైడ్ మేనేజ్మెంట్) ప్రారంభించారుఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ టి సి ఎస్ టెక్నాలజీ, సాఫ్ట్వేర్ అండ్ సర్వీసెస్ విభాగ అధ్యక్షులు శ్రీ వి. రాజన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ కీర్తిశేషులు డాక్టర్ రతన్ టాటా తో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. రతన్ టాటా నైతిక విలువలు, కష్టపడి పనిచేసే స్వభావం కలిగిన మహనీయుడని కొనియాడారు. యువతలో ప్రతిభను పెంపొందించే బాధ్యతగల విద్యాసంస్థలు ఇటువంటి విలువలను విద్యార్థుల్లో నాటాలని, అలాగే మెరుగైన మౌలిక వసతులు ఈ లక్ష ్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రంథాలయాలు మరియు అభ్యాస వసతులు విద్యార్థుల విద్యా పురోగతికి, ఉద్యోగావకాశాలకు ఎంతో బలమని ఆయన పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ ) కూడా ఒక సాంకేతిక పరిణామమేనని, ఇది ఉద్యోగ నష్టాలకు కారణం కాదని, కొత్త అవకాశాలు మరియు కొత్త పాఠాలు నేర్చుకునే మార్గమని తెలిపారు. ఏఐ ద్వారా తక్కువ సమయంలో సమస్యలకు పరిష్కారాలు కనుగొని సమయాన్ని ఆదా చేసుకోవచ్చని వివరించారు. అనంతరం శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి. విష్ణు రాజు మాట్లాడుతూ, తమ విద్యాసంస్థలో మేనేజ్మెంట్ విద్యకు విశేష ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇది సమాజ అభివృద్ధికి మాత్రమే కాకుండా వ్యాపార రంగ పురోగతికి కూడా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. టాటా సంస్థలు వ్యాపార రంగంలో బలమైన నైతిక విలువల వ్యవస్థను నిర్మించడంలో విశేష కృషి చేశాయని, భవిష్యత్ తరాలు ఈ విలువలను కొనసాగించేలా విద్యాసంస్థలు వాటిని అలవర్చాలని సూచించారు. ఇంజినీరింగ్తో పాటు మేనేజ్మెంట్, హ్యూమానిటీస్ వంటి అన్ని విభాగాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం తమ లక్ష ్యమని తెలిపారు. అదే ఉద్దేశంతో మేనేజ్మెంట్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అత్యాధునిక సదుపాయాలతో రతన్ టాటా బ్లాక్ నిర్మించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ సంస్థ లక్ష ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ శ్రీ రవిచంద్రన్ రాజగోపాల్, కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ్మ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, మేనేజ్మెంట్ విభాగాధిపతి డా. ఐ. నాగేశ్వరరావు, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ శ్రీ పి. సతీష్ చంద్ర, శ్రీ రవి డా. ఏ. రాజు, డా. శివకృష్ణన్, కళాశాల మేనేజర్ బి బాపిరాజు, ఏవో సురేష్, వివిధ ఇంజినీరింగ్ విభాగాధిపతులు, డీన్లు, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రైతు వారోత్సవాలు

**-మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్**

**మొగుడంపల్లి, మే 3, ప్రభాతవార్త:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4నుంచి 9వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులు,ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. మే 4న నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి రకాల సాగుపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. 5న ఉద్యాన పంటలు, ఆయిల్ ఫామ్ విస్తరణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 6న బ్యాంకుల ద్వారా పంట రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పీఓల సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలపై మార్గ నిర్దేశం చేయిస్తామన్నారు. 7న వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, సైర విద్యుత్ పథకాలు (పీఎం కిసాన్)పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. 8న పశుసంవర్ధక, మత్స్య, నీటిపారుదల శాఖల సమన్వయంతో పశు సంరక్షణ, చెరువుల నిర్వహణ, నీటి వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. 9న గ్రామ స్థాయిలో చెరువుల శుభ్రత, పరిశుభ్రత, సమతుల్య నీటి వినియోగంపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, రైతులు కార్యక్రమాలను విజయవంతం చేయాలని నవీన్‌కుమార్ సూచించారు.



మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్

### నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, మే 3, ప్రభాతవార్త:** ఆదివారం మండల పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన కుస్నూరర్ జ్ఞానరెడ్డి కుమార్తె వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎపిటిసి సభ్యులు పండరీనాథ్ పాటిల్, నాయకులు సాగర్ వెంకన్న తదితరులు ఉన్నారు.



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## గ్రామ సుభిక్షానికి మైకోడ్‌లో హోమాలు

**మనూర్, మే 3, ప్రభాతవార్త:** గ్రామ సుభిక్షాన్ని కాంక్షిస్తూ మండల పరిధిలోని మైకోడ్ గ్రామంలో ఆదివారం హోమాలు నిర్వహించారు. ప్రతిమాసం మొదటి ఆదివారం గ్రామానికి చెందిన దంపతులతో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో హోమ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఇందులో భాగంగా ఆదివారం వివేకానంద సేవా సమితి సభ్యులు సకుంట పరివారముగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) వితరణ నిర్వహించారు.



మైకోడ్‌లో హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

## రేజింతల్‌లో 5గురు జూదరులు అరెస్టు

**-నగదు, పేక ముక్కలు, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**న్యాల్‌కల్, మే 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రేజింతల గ్రామ శివారులోని ముస్లిం మైనార్టీ స్మశానవాటిక వెనుక గల ఖాళీస్థలంలో జూదం ఆడు తున్న 5గురిని అదు పు లోకి తీసుకున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ తెలిపారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం గుట్టు చప్పుడు కాకుండా కొందరు జూదం ఆడుతున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో జూదగృహంపై దాడిచేసి పత్తాలు ఆడుతున్న 5గురిని అదుపులోకి తీసుకుని 52 పేక ముక్కలు, 4150 నగదు, 3సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.



రేజింతల్‌లో జూదరులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నర్సాపూర్ మే 3, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చక్కపల్లి మోడల్ స్కూల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫర్హానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు జక్కపల్లి మోడల్ స్కూల్లో కళాశాలలో చేరడానికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదవ తరగతి పాసై మోడల్ స్కూల్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదవడానికి ఆసక్తి గల విద్యార్థినులు మీ సేవలో తమ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మోడల్ స్కూల్ కళాశాలలో మొదటి సంవత్సరం బైపిసి, ఎంపిసి, సిఇసి కోర్సులో 100 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపల దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు అప్పటిలోగా ప్రవేశాల సమాచారాన్ని తెలుసుకోవడానికి సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ ఫర్హానా తెలిపారు .

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక
## రైతు వారోత్సవాలకు ఆహ్వానం

**కొల్చారం, మే 3 (ప్రభాత వార్త):**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాల కార్యక్రమాన్ని



నిర్వహిస్తున్నట్లు కొల్చారం మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి స్రవంతి తెలిపారు. ఈ కార్యక్రమం మే 04న ఉదయం 8:30 గంటలకు కొల్చారం రైతు వేదికలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, రైతులు, ప్రజా ప్రతినిధులు, అలాగే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఉదయం 9 గంటలలోపు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## చేపల వేటకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి

**ఝరాసంగం, మే 3, ప్రభాతవార్త:** చేపల వేటకు వెళ్లి ప్రమాదావశాస్తు చెరువులో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల సంగప్ప (52) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఆదివారం గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టుకునేందుకు వెళ్లి చేపలు పట్టే వల కాళ్లకు బిగుసుకుపోయి ప్రమాదావశాస్తు చెరువులో మునిగి మృత్యువాత పడ్డాడన్నారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాతమన్నారు.

## సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ డివిజన్‌లలో ప్రతి సోమవారం ప్రజావాణి

### జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట రూరల్, మే 3, ప్రభాతవార్త :**
జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టరేట్‌తో పాటు హుస్నాబాద్, సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఏ డివిజన్ వారు అక్కడే ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రెవెన్యూ డివిజన్‌స్థాయిలో సైతం ప్రతి సోమవారం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు ఏ సమస్యనైనా రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు మూడు డివిజన్ కేంద్రాలలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం



జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజావాణి ప్రారంభం అవుతుందన్నారు.

## రామాయంపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**రామాయంపేట, మే 3, ప్రభాతవార్త :**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మొదటి వార్డులో పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రూ.25 లక్షల నిధులతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులకు ఆదివారం నాడు భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు చొరవతో మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు దేవుని రంజిత్, గుగులోత్ రవి, కోఆప్షన్ సభ్యులు దేమె యాదగిరి, మహ్మద్ గౌస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, నాయకులు రమేష్‌రెడ్డి, బైరం కుమార్,



రామాయంపేటలో పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు

బొర్ర అనిల్ కుమార్, చింతల యాదగిరి, పోచమ్మల గణేష్, గావు భాస్కర్, ఒడ్డి స్వామితో పాటు వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరూర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు

**షేర్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు లక్షల వ్యయంతో ఇళ్ల నిర్మాణం**

**సదాశివపేట మే 3 (ప్రభాత వార్త):**
ఆరూర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాపాలనలో భాగంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలో ఒకటైన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన ఇళ్లకు సామూహిక గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. షేర్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒక్కో ఇల్లు సుమారు ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసీ చైర్పర్సన్ శ్రీమతి తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి లబ్ధిదారులకు ఇళ్లను ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు గృహ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి అర్హ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
గ్రామ సర్పంచ్ నాయికోటి లావణ్య - మధు మాట్లాడుతూ, ఇంకా అర్హులైన వారందరూ రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఎవరైనా లబ్ధిదారులు మిగిలి ఉంటే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, హౌసింగ్ ఏఈ రేష్మా,



ఇందిరమ్మ గృహం ప్రారంభిస్తున్న నిర్మల జగ్గారెడ్డి

గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేశం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సిద్ధన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మధు, ఉపసర్పంచ్ విఠల్, మండలంలోని సర్పంచులు షాబుద్దీన్, మల్లేశం, బాబు, శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీకాంత్, వార్డు సభ్యులు భారత్, భాగ్యలక్ష్మమ్మ, అంజయ్య, మన్నే నాగేశ్, పద్మ, భారతమ్మ, రమేష్, లక్ష్మమ్మ, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లిపూర్ మెథడిస్ట్ క్రైస్తవ జాతరలో పాల్గొన్నా

**మాజీ మంత్రిజహీరాబాద్ ఇంచార్జ్ డా.ఏ.చంద్రశేఖర్**

**జహీరాబాద్ మే 3 ప్రభాతవార్త**
జహీరాబాద్ పట్టణంలోని అల్లిపూర్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చ్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న క్రైస్తవ జాతరలో ఆదివారం మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం రాక పూర్వమే జహీరాబాద్ ప్రాంతంలో రెవ.బి.తీ గార్డెన్ దొర ఇక్కడ క్రైస్తవ జాతర ప్రారంభింవారన్నారు. గార్డెన్ ధర క్రైస్తవ మిషనరీ ద్వారా మెథడిస్ట్ చర్చ్ ను మరియు విద్యా వైద్య సేవలను జహీరాబాద్ ప్రాంతంలో ప్రారంభింవారన్నారు. మెథడిస్ట్ సంఘం ద్వారా యేసు క్రీస్తు బోధనలను పరిచర్య చేస్తూ అనేకులు రక్షణ మార్గంలో నడిపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు ,మొగుడంపల్లి మండల అధ్యక్షులు మాక్సూద్ అహ్మద్ , కౌన్సిలర్ మహేష్ ,మాజీ ఎంపీపీ దేవదాస్ , త్త్రియు మాజీ ఎంపీటీసీ గూనెల్లి అశోక్ సయ్యద్ వాజహత్ అలీ అడ్వకేట్ , అల్లిపూర్ జాతర కమిటీ



జహీరాబాద్ అల్లిపూర్ మెథడిస్ట్ క్రైస్తవ జాతరలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్

సభ్యులు పాల్గొన్నారు..

## జాతరలో తేనెటీగల దాడి
### 25 మంది భక్తులకు గాయాలు

**పూడూరు, మే 3, ప్రభాతవార్త :** తేనెటీగల దాడిలో 25మందికి గాయాలైన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని రాకంచెర్ల జాతరలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని రాకంచెర్లలో గతమూడు రోజులుగా తిరుమలనాథస్వామి (శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహ్మస్వామి) ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు కొందరు ఉత్సవాలను తిలకించి స్వామివారిని దర్శించుకొని గుడి వెనకాల ఉన్న మామిడి చెట్లనీడలో సేదతీస్తున్నారు. అదే సమయంలో అకస్మాత్తుగా చెట్టుపైనున్న తేనెటీగలు భక్తులపై దాడీచేయడంతో సుమారు 25మందికి గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు,ఇతర భక్తులు 108కు సమాచారమివ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్సు దాడీకిగురైన వారిని పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి తీవ్రగాయాలైన 5మందిని మెరుగైన చికిత్సకోసం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్‌చేశారు. అక్కడ చికిత్స పొందిన పలువురితోపాటు పరిగి ప్రభుత్వాసుపత్రిలో తికిత్స పొందిన వారందరూ డిస్చార్జీ అయినట్లు, సీరియస్‌గా ఉన్న ఒకరుమాత్రమే వికారాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్

**మొయినాబాద్, మే 3, ప్రభాతవార్త :** మొయినాబాద్ పోలీసుల చాకచక్యంతో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఆదివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మొత్తం ఆరు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం గోవిందపల్లి గ్రామానికి చెందిన హరిజన రామకృష్ణ (20), అదే మండలం కోరటిపల్లి గ్రామానికి చెందిన బత్తుల విజయ్ కుమార్ (22) కలిసి ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. నిందితులు మొయినాబాద్ పరిధిలో నాలుగు బైకులు, చేవెళ్లలో ఒకటి, కూకట్పల్లిలో ఒకటి చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నారు. ఈ మేరకు పోలీసులు మొత్తం ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నారు.
ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించిన మొయినాబాద్ సీఐ మల్లికార్జున రెడ్డి, క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, డీఎస్ఐ సుభాష్‌లను చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, ఏసీపీ కిషన్ ప్రత్యేకంగా అభినందించారు. జాగ్రత్తలు అవసరం - పోలీసుల సూచనలుఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్ల ముందు నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగలను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ అమర్చుకోవాలని సూచించారు. రాత్రిపూట గ్రామాలు, కాలనీలలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ట్రాన్స్ పార్మర్ ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, మే 03, ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని జిల్లెడు గ్రామంలో ఆదివారం విద్యుత్ ట్రాన్స్ పార్మర్‌ను ప్రారంభించారు. గ్రామంలో లో ఓల్టేజి సమస్య ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సర్పంచ్ మౌనిక శశిధర్‌లు తెలిపారు. దీనికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో సమస్య సరిష్కరించాలని విద్యుత్ అధికారులను అదేశించారు. గ్రామంలో సమస్య తీర్చేందుకు నూతన విద్యుత్ ట్రాన్స్ పార్మర్‌ను ఏఈ నర్సింహులు బిగించారు. దీంతో గ్రామంలో విద్యుత్ సమస్య తీరిందని గ్రామ సర్పంచ్, గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మాసుల నరేష్, పల్లె రాజు, మద్దూరి రజిత మహేష్, ప్రవీణ్ పటేల్, బ్యాగరి బాలరాజ్, వాటర్ మెన్ జానీ, చాకలి నాగరాజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటంతో ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం చేస్తున్న దృశ్యం

## నెరవేరిన పేదింటి కల

**రామాయంపేటలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం**

**రామాయంపేట, మే 3, ప్రభాతవార్త :**పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం నాడు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులోని లబ్దిదారుడు మ్యాతరి కిషన్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఆదివారంనాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆదేశాల మేరకు పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. పేదలకు సొంత ఇల్లు అనేది ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్లు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మఇళ్ల పథకం ద్వారా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని తెలిపారు. గృహ ప్రవేశం అనంతరం లబ్ధిదారు కుటుంబం కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్‌లు దేవుని రంజిత్, కోఆప్షన్ సభ్యులు దేమె యాదగిరి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, నాయకులు రమేష్‌రెడ్డి, చింతల యాదగిరి, పోచమ్మల గణేష్, చిలుక విరాట్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐగా తోట తిరుపతి

**బెజ్జంకి, మే 3, ప్రభాతవార్త :** బెజ్జంకి మండల నూతన ఎస్ఐగా తోట తిరుపతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన సౌజన్య బదిలీ కావడంతో ఆమె స్థానంలో నూతన ఎస్ఐగా తోట తిరుపతి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ధ్యేయమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.




ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత

**కొల్చారం, మే 3 (ప్రభాత వార్త):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సూచించారు. ఆదివారం కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామ శివారులో ఎల్లమ్మ ఆలయం ఆవరణలో రంగంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రారంభించారు.
ముందుగా తూకానికి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం ధాన్యాన్ని తూకం వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తాము పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాబన్నగారి రవితేజ రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, సొసైటీ మాజీ చైర్మన్ ఆరిగె రమేష్ కుమార్, మాజీ ఉపాధ్యక్షులు మోత్కు మల్లేశం, తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, ఉప్ప సర్పంచ్ ఆరె రవీందర్, సీఈవో నవీన్ యాదవ్, బీరప్ప, వార్డు సభ్యులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

### నేడు జహీరాబాద్ నియోజకవర్గ ప్రజావాణి

**జహీరాబాద్ ,మే 3, ప్రభాతవార్త :** జహీరాబాద్ నియోజకవర్గ ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 4వ తేదీ సోమవారం జహీరాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో ఆర్డీవో దేవుజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ పి. దశరథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని తహసిల్దార్ సూచించారు.

## చెరువులో మునిగి వ్యక్తి మృతి

**జోగిపేట, మే 3, ప్రభాతవార్త:** ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన జోగిపేటలో ఆదివారంనాడు సాయంత్రం చోటుచేసుకుంది. జోగిపేటలోని వాసవినగర్ కాలనీకి చెందిన ఉప్పుపోచయ్య కొంతమంది పిల్లలతో కలిసి అందోలు చెరువులో ఈతకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అతని భార్య ఉప్పు పోచమ్మ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు.

## రైతుల ఉసురు పోసుకుంటున్న రేవంత్‌రెడ్డి సర్కార్



రైతులతో కలిసి రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న హరీశ్‌రావు

**చిన్నకోడూరు, మే 3,ప్రభాతవార్త :**
ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కాంగ్రెస్ సర్కార్ అరిగోసపెడుతుందని మాజీ మంత్రి,బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మల్లారం బస్సు స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతులు పెద్దయెత్తున ధర్నా చేపట్టారు. హరీష్‌రావు రైతులతో కలిసి ధర్నా పాల్గొన్నారు. దీంతో రాజీవ్ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి, ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ వడ్లు కొనుగోలు చేయకుండా రైతుల ఉసురు పోసుకుంటున్న డూప్లికేట్ రైతు బిడ్డ రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం కావాలనే వడ్లు కొనొద్దనే కుట్రతో రకరకాల నిబంధనల పేరిట రైతులను గోస పెడుతుందన్నారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారే తప్ప ఒక్క గింజ కూడా ఎత్తడం లేదన్నారు. రాష్ట్రంలో వడ్లు కొత్తగా పండుతున్నాయా..గతంలో ప్రభుత్వాలు కొనలేదా...బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వడ్లు కొనుగోలు చేసిందన్నారు. ఈ యాసంగిలో 90 లక్షల టన్నుల వడ్లు కొంటామని చెప్పి కనీసం 9 లక్షల టన్నులు కూడా కొనలేదన్నారు. మద్దతు ధర రాక రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఒక వైపు 44 డిగ్రీల ఎండలో రైతులు మాడిపోతున్నా ...వడదెబ్బ తగిలి కుప్పల వద్ద రాలిపోతున్నా ..రేవంత్‌రెడ్డికి కనికరం రావడం లేదన్నారు .నువ్వు నిజంగా రైతు బిడ్డవైతే తక్షణమే కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించి వడ్లు కొనుగోలు చేసేలా చూడాలన్నారు. సచివాలయంలో ఉన్న ఉన్నతాధికారులను జిల్లాకు ఒకరి చొప్పున ఇన్‌చార్జిగా పంపించి యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు చేయించాలన్నారు.
కొనుగోలు కేంద్రాల కు తీసుకవచ్చిన వడ్లను ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లించాలన్నారు. వడ్ల కొనుగోలుపై ప్రభుత్వానికి కనీస పాలన లేదన్నారు. మొక్కజొన్న రైతులకు వెంటనే గన్నీ బ్యాగులు ఇవ్వాలని...ఆపేసిన సన్‌ఫ్లవర్, జొన్నలు, శనగల కొనుగోలుల వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు కూర మాణిక్యరెడ్డి, కీసర పాపయ్య, కొండం రవీందర్‌రెడ్డి, జంగిటి శ్రీనివాస్, కనకరాజు, కాముని ఉమేష్‌చంద్ర, హరీష్, రాజశేఖర్‌రెడ్డి, అనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నీట్ పరీక్షలు

### 3,404మంది అభ్యర్థులు హాజరు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 3, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 12 నీట్ పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగ జరిగాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 నీట్ పరీక్షా కేంద్రాల్లో 3,468మంది అభ్యర్థులు పరీక్షలు రాయటానికి ఏర్పాట్లు చేయగా, వీరిలో పరీక్షలకు 3,404మంది అభ్యర్థులు హాజరు అయినట్లు, 64మంది పరీక్షకు గైర్హాజరు అయినట్లు నీట్ పరీక్షల సిటీ కోఆర్డినేటర్ ఇవి రమణ తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం-1లో నిర్వహిస్తున్న నీట్ పరీక్షా నిర్వాహణను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఆదివారం జిల్లాలోని ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం-1లో నిర్వహిస్తున్న నీట్ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి నీట్ పరీక్షల నిర్వాహణను ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహణ ఏర్పాట్లపై కళాశాల యాజమాన్యాన్ని, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు మంచినీరు, కరంటు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల్లో మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని, పరీక్షలు ప్రశాంతంగ నిర్వహించాలని యాజమాన్యాలకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఈ పర్యటనలో మేడిపల్లి తహసీల్దార్ నర్సింహ్మారెడ్డి, కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా ఉప్పల్ కేంద్రీయ విద్యాలయంలో నీట్ పరీక్షా నిర్వాహణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

**ఘట్‌కేసర్, మే 3, ప్రభాతవార్త:** ప్రభుత్వం రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేయాలని ఘట్‌కేసర్ మండల రైతు ఋణమాఫీ సాధన సమితి కన్వీనర్ కంట్లం గౌరీశంకర్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పరిధిలో పండించిన వరిధాన్యం సేకరించేందుకు అధికారులు 4 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ చివరి నాటికి రైతుల ఖాతాలో 3వ విడత రైతుభరోసా డబ్బులు వేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికి వేయకపోవడంతో రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని తెలిపారు. రైతులు ధాన్యం దిగుబడి చేసుకొని కల్లాల్లో ఎండబోస్తున్నారని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవకపోవడంతో 30 శాతం దాకా ధాన్యం రైస్ మిల్లర్లకు వెళ్లిందని తెలిపారు. ఎదులాబాద్‌లోని తిరుమలయ్యబండ వద్ద ఎండలో రైతులు వడ్లు ఎండబోసి కాంటాలో విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారని ఈసమయంలో వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి రైతాంగానికి నష్టం జరిగే ఆస్కారముందని ఆయన తెలిపారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో పంటఋణాలు పొందిన దాదాపు 1,200 మంది రైతులకు ఇప్పటివరకు ఋణమాఫీ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## వారంలోపే చెల్లింపులు


**◆పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు ◆రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం ◆ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**పెద్దేముల్, మే 3, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శక విధానంతో చేపడుతున్నామని, రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజులలోపే రైతుల ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, తాండూర్ నియోజకవర్గ ఆత్మ ఛైర్మన్ శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ పట్లోల్ల నర్సిములు, కోటపల్లి మార్కెట్ కమిటి ఛైర్మన్ అంజయ్య, వైస్‌ఛైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

**★ఉదయం నుంచి భానుడి భగభగలు ★ఎండ తీవ్రతకు అలమటిస్తున్న మూగజీవాలు**

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** ఎక్కడ చూసినా భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమని దంచి కొడుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలనుండే భానుడు తన ప్రతా పాన్ని చూపి స్తున్నాడు. దీంతో జనాలు ఉక్కు పోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యప్తంగా 43, డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై జనాలను, మూగజీవాను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవ కాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం. ఇట్టి ఉష్ణోగ్రత పలు జిల్లాలలో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చ రికలు జారీ చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలలకు ఆరెంజ్ అలర్టు జారీ చేసింది. రానున్న రోజుల్లో ఆయా జిల్లాలలో 41, నుంచి 45, డిగ్రీలు దాటే అవకాశాలు కూడా ఉన్నాయని సూచిస్తున్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జనాలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. అయినా అకాల వాతావరణంతో ప్రజలు, మూగ జీవాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఎందుకంటే పగలంతా ఎండ తీవ్రత అత్యదిక ఉష్ణోగ్రతలు, అధిక వేడి,



సాయంత్రానికి ఉరు ములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం, ఆపై పిడుగులు పడి మూగ జీవాలు మృత్యు వాత పడుతున్నాయి.

ఇందుకు ప్రజలే వాతా వరణానికి అనుకూలంగా చూసి జాగ్రత పడాల్సి న అవసరం ఎంతైనా ఉందని అనుబవజ్ఞులు తమ అనుభవాలను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, ఎందుకంటే అందుబాటులో ఆసు పత్రులుండవు, రాత్రి పూట రవాణా సౌకర్యం లేకపోవడంతో మరీ ఇబ్బదులు ఎదుర్కోవలపిన పరిస్థితి ఏర్పడుతుంది. కావున ఈ వేసవి కాలాని కణుగూణంగా జాగ్రత్తలు తీసుకోవాలని సంభంధిత అధికారులు సూచిస్తున్నారు.



అడుగడుగునా

## రైతు భద్రతే లక్ష్యంగా..

**నేటి నుంచి రైతు వారోత్సవాలు**

- సమతుల్య ఎరువుల యాజమాన్యం,
- పక్కృతి వ్యవసాయం
- దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు,
- సొసైటీల ద్వారా రైతులకు సేవలు,
- వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్

**అవకాశాలు తదితర అంశాలపై అవగాహన**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 3, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి 9వరకు రైతువారోత్స వం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి కె.చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ రోజు వారీగ నిర్వహించే రైతు వారం కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 4న నేల ఆరోగ్యం పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం-ప్రకృతి వ్యవసాయం, అదే విధంగా ఫౌరసరపరాల శాఖ వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై రైతు వేదికల్లో రైతులకు సంబంధిత అధికారులు వివరిస్తారని అన్నారు. ఈ నెల 5న ఉద్యాన పంటల సాగు- ఆయిల్ ఫామ్ సాగు, విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగుపై (కాన్సి ట్యూఎన్సీ స్థాయిలో) వివరిస్తారని ఆమె తెలిపారు. 6న బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పిఓల ద్వారా రైతులకు సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు పై రైతు వేదికల్లో వివరిస్తారని తెలిపారు. 7న వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు-పిఎం కుసుమ్, వ్యవసాయ యంత్రీకరణ-డ్రోన్స్ (కాన్సి ట్యూఎన్సీ స్థాయిలో) వివరిస్తారని అన్నారు. 8న పశు సంవర్ధక శాఖ,పాడి పరిశ్రమ, పశు జాతి అబివృద్ధి, దూడల ప్రదర్శన, గడ్డి విత్తనాలు-వేసవిలో పశు సంరక్షణ (మండల స్థాయిలో), మత్స శాఖ వారు చెరువులలో కలుపు మొక్కల నివారణ, వ్యాదుల నియంత్రణ, అధికోత్పత్తి చర్యలు వాటిపై, అదే విధంగా నీటి పారుదల శాఖ నుంచి సమర్ధ నీటి విడుదల కొరకై గేట్ల నిర్వాహణ, ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, కాలవల్లో కంపచెట్లు, గుర్రపు డెక్కల తొలగింపు వాటిపై సంబంధిత శాఖల అధికారులు వివరిస్తారని అన్నారు. 9న నీటి పారుదల శాఖ వారు చెరువులలో కంప చెట్లు, గుప్రు డెక్కల తొలగింపు, సమతుల్య నీటి వినియోగం, కార్యాలయాల పరిశుభ్రత (గ్రామ స్థాయిలో) సంబంధిత అధికారులు రైతులకు వివరించనున్నట్లు తెలిపారు.

### కోత కోసి 20 రోజులు కావస్తున్నా..

## కొనుగోలు కేంద్రాలు లేవ్

**✷రోడ్లపై కుప్పలుగా పోసి రైతులు పడి గాపులు కాస్తున్నారు✷ తక్షణం ఏర్పాటుచేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం ✷మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ధ్వజం ✷మెట్లకుంటలో రైతులతో కలిసి మహా ధర్నా**

**కొడంగల్, (బొంరాస్‌పేట్)మే 3, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట గ్రామంలో రైతులకు మద్దతుగా మండల బీఆర్ఎస్ పార్టీ అద్యక్షులు కోట్ల యాదగిరి అధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఇలాకా అయన కొడంగల్‌లో రైతులు వరి కోత కోసి 20 రోజులు కావస్తున్నా నేటివరకు వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. ఆరుగాలం కష్టపడి అప్పు చేసి పండించిన వరి ధాన్యాన్ని అన్నదాత రోడ్లపై కుప్పలుగా పోసి పడి గాపులు కాస్తున్నారని అన్నారు. రైతు బంధు, రుణమాఫీ, రైతు బీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలు ఏవి కూడా రేవంత్ సర్కార్ రైతులకు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. కేసీఆర్ హయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో రైతులకు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించేదని గుర్తుచేశారు.

**రుణమాఫీని నిరూపిస్తే బిఆర్ఎస్ పోటీ చేయదు**

సిఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సంపూర్ణ రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయదని సవాల్ విసిరారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేడుతామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసుదన్‌యాదవ్, చాంద్‌పాషా, శేరి నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవిగౌడ్, లగచర్ల సురేష్, బండ శ్రీను, మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంటలో చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

## భైర్‌ఖాన్‌పల్లిలో అర్ధరాత్రి ఉద్రిక్తత

**అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు**

**స్థానికులను బెదిరించి వాహనాలను తరలించిన మాఫియా టీం**

**పోలీసులకు సమాచారం ఇచ్చినా సకాలంలో రాలేదని ఆందోళకారుల ఆగ్రహం**

**కేశంపేట, మే 3, ప్రభాతవార్త:** కేశంపేట మండలంలోని భైర్ ఖాన్‌పల్లి గ్రామంలో అక్రమ మట్టి రవాణా వ్యవహారం శనివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి సమీ పంలో ఇలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అర్ధరాత్రి వేళ భారీగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గుర్తించిన గ్రామస్థులు, పర్యావరణానికి వ్యవసాయ భూములకు నష్టం జరుగుతుందని ఆందోళనతో ముందుకు వచ్చి వాటిని అడ్డుకున్నారు. రాత్రి సుమారు 3:20 గంటలకు అత్యవసర నంబర్ 100కు సమాచారం ఇచ్చినప్పటికీ, పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు తెల్లవారుజామున 4 గంటల తర్వాత ఘటన స్థలానికి చేరుకోలేదని గ్రామస్థులు తెలిపారు. అదేసమయంలో మట్టి మాఫియాకు చెందిన కొందరు అక్కడికి చేరుకుని తమతో వాగ్వాదానికి దిగారని వివరించారు. ఉద్రిక్త పరిస్థితుల్లో బలవంతంగా మట్టి లోడ్ ఉన్న టిప్పర్లను అక్కడి నుంచి తరలించుకెళ్లినట్లు చెప్పారు.

మట్టి లోడ్ టిప్పర్లు వెళ్లిపోయిన తరువాత అక్కడ ఉన్న పోలీసులు ఖాళీ టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా తమపైనే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు గ్రామస్తులు మీడియాకు వివరించారు. ప్రజల భద్రత కాపాడాల్సి న పోలీసులే ఇలా ప్రవర్తించడం ఆందోళనకరంగా ఉందని వాపోయారు. మహేశ్వరం మండలంకు చెందిన మట్టి మాఫియా దర్జాగా షాద్‌నగర్ నియోజకవర్గంలో మట్టిని తరలించుకు పోతుంటే ఇక్కడి నాయకులు, కొందరు స్థానికులు వారి వద్ద డబ్బులు తీసుకుని ప్రోత్స హిస్తున్నారని ఆరోపించారు. అక్రమ మట్టి రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



భైర్‌ఖాన్‌పల్లి మీదుగా అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు(ఇన్‌సెట్)అర్ధరాత్రి గ్రామస్తులు అడ్డుకున్న వాహనం

## పంట చేతికొచ్చినా.. చేలోనే!

**ధారూర్, మే 3, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రబీ సాగులో భాగంగా ఎంతో కష్టపడి జొన్న పంటను పండించామని, ప్రస్తుతం ఆ పంట కోత దశకు చేరుకుని చేతికి వచ్చిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దిగుబడిని కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం జొన్న పంటకు మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,690గా నిర్ణయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తమకు ఆ ధర దక్కడం లేదని వాపోయారు.

దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి అతి తక్కువ ధరకే జొన్నలను కొనుగోలు చేస్తునానరని చెప్పారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రం లేక, వర్షాలు వస్తాయేమో అన్న భయంతో ఆందోళనతో ఉన్న తాము దళారులు అడిగిన ధరకే విక్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీనవల భారీగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ధారూర్ మండల కేంద్రంలో అధికారిక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని ధారూర్ మండల బిఆర్ఎస్ (టిఆర్ఎస్) పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. తద్వారా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర నేరుగా అందుతుందని, దళారీల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు.

**కొనుగోలు కేంద్రాలు లేక జొన్న రైతుల అగచాట్లు**

**దిగుబడిని కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నామని ఆవేదన**

**అకాల వర్షం భయంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నామని వెల్లడి**

**మద్దతు ధరలో కోతలు పెడుతున్నారని ఆందోళన**

**జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి**



జొన్న పంటను పొలాల్లోనే ఎండబెడుతున్న రైతులు

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

## ఇద్దరు మృతి

**♦ చేవెళ్లలో కారు టైరు పగిలి ఒకరు..**
**♦ షాబాద్‌లో రోడ్డు దాటుతుండగా ఇంకొకరు..**

**చేవెళ్ల, మే 3, ప్రభాతవార్త :** రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఓ యవకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పామేన చౌరస్తా వద్ద ఆదివారం వెలుగుచూసింది. బాధిత కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం... మండల పరిధిలోని గుండాల పంచాయతీ పరిధిలోని లక్ష్మిగూడ గ్రామానికి చెందిన కొలను శ్రీశైలంరెడ్డికి ఒక కుమార దివాకర్ రెడ్డి(25) ఇద్దరు కూతుళ్లు, కొడుకు షార్ట్ ఫిలిమ్స్ తీస్తుంటాడు. రెండు రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటూ ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో దివాకర్ రెడ్డి తన షిఫ్ట్ కారులో చేవెళ్ల నుంచి ఇంటికి బయలు దేరాడు. పెట్రోల్ పంపు సమీపంలోకి రాగానే పామెన వైపు నుంచి చేవెళ్లకు వస్తున్న బ్రిజా కారు టైర్ పగిలి డివైడర్‌ను దాటి ఎదురుగా ఉన్న షిఫ్ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన దివాకర్ రెడ్డి కారులో ఇరుక్కుపోవడంతో స్థానికులు డొర్లు తెరిచి 108 వాహనంలో చేవెళ్ల ప్రభుత్వకి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. బ్రిజా కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దివాకర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాన్ని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఒక బాబు ఉన్నాడు. ఇటీవలనే బాబు మొదటి సంవత్సరం పుట్టిన రోజు వేడుక జరిపారు. ఇంతలో అతడు మృతి చెందడంతో ఆకుటుంబంలో, గ్రాములో విషాదచాయలు అలుముకున్నారు.



చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దివాకర్ రెడ్డి (ఫైల్)

**కూరగాయలు తీసుకొని వెళ్తుండగా..**

**షాబాద్, మే 3, ప్రభాతవార్త :** రోడ్డు దాటుతుండగా డీసీఎం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి లో ఆదివారం చోటు చేసుకుంది. షాబాద్ ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు.. అస్సాం రాష్ట్రానికి చెందిన మనేష్ దాస్ (22) మల్లారెడ్డి గూడ గ్రామం వద్ద కంపెనీలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నాడు. కిరాణా దుకాణంలో కూరగాయలు తీసుకొని మనేష్ దాస్ రోడ్డు దాటుతుండగా చేవెళ్ల నుండి షాబాద్ వైపు వెళుతున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు ఆకాష్ దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేడు ప్రజా పాలనపై సమావేశం

**జిల్లెడు చౌదరిగూడ, మే 3, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో గల రైతు వేదికలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంపై సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చౌదరిగూడ , ఎదిర , పెద్ద ఎల్కిచర్ల గ్రామాలలో గల రైతు వేదికలలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు.